ములుగులో సబ్ ఆర్సీవో కార్యాలయం ఏర్పాటు



ములుగు, న్యూస్‌టుడే: గిరిజన రీజినల్ కో-ఆర్డినేటర్ కార్యాలయం మహబూబాబాద్‌లోనే ఉంటుందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా ములుగులో సబ్ రీజినల్ కో-ఆర్డినేటర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని మంగళవారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. మహబూబాబాద్‌లోని ఆర్సీవో కార్యాలయాన్ని తరలిస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలు నమ్మొద్దని సూచించారు. ములుగులో ఏర్పాటు చేయనున్న సబ్ ఆర్సీవో కార్యాలయంతో భూపాలపల్లి జిల్లాతో పాటు ములుగు ప్రజలకు ఉపయోగపడుతుందని తెలిపారు. అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులను అందుబాటులో ఉంచడానికి ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. ములుగు, మహబూబాబాద్ జిల్లాలతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు.

ఓటరు నమోదు సర్వేపై సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి

ములుగు, న్యూస్‌టుడే: నూతన ఓటరు నమోదుపై గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మంగళవారం వివిధ జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ టీఎస్. దివాకర, జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్. మహేందర్‌జీ, ఆర్డీవో కె. సత్యపాల్ రెడ్డి పాల్గొన్నారు. నూతన ఓటరు నమోదుపై ఇప్పటి వరకు జరిగిన సర్వే తీరును వివరించారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ శబరీష్, చిత్రంలో పోలీసు అధికారులు

ములుగు టౌన్, న్యూస్‌టుడే: యువత క్రీడల్లో రాణించాలని జిల్లా పోలీసు అధికారి శబరీష్ అన్నారు. డ్రగ్స్ వ్యతిరేక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జాకారం గురుకుల పాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత నైపుణ్యం ప్రపంచానికి తెలియాల్సి ఉందన్నారు. క్రీడలతో మంచి భవిష్యత్తు ఉందని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు చేస్తే వెంటనే స్థానిక ఎస్సై, 100కు సమాచారం అందించాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతోపాటు ప్రభుత్వం తరుపున రివార్డు అందజేస్తామన్నారు. మత్తుపదార్థాలతో ఎంతోమంది జీవితాలు నాశనమయ్యాయని, వీటి నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఓఎస్డీ గితే మహేష్, అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీలు రవీందర్, రాములు, సీఐలు శంకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి



అబ్బాపురంలో నిర్వహించిన శిబిరంలో సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

ములుగు, న్యూస్‌టుడే: ములుగు మండలం అబ్బాపురంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎనిమిది మంది వైద్యులతో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా వైద్యాధికారి ఎ. అప్పయ్య పర్యవేక్షణలో 363 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అబ్బాపురంతో పాటు బాణాలపల్లి, కుమ్మరపల్లి, శ్రీరాములపల్లి గ్రామాల్లో కూడా శిబిరాలు ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ కాలానుగుణ వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎ. అప్పయ్య శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. గుంతల్లో నీరు నిల్వఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమకాటుకు గురికాకుండా దోమతెరలను వినియోగించాలన్నారు. వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వర్షాకాలం పూర్తయ్యేంతవరకు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వైద్యులు నిత్యం స్థానికులకు అందుబాటులో ఉండి సేవలందించాలని, సేవల్లో నిర్లక్ష్యం సరికాదని సూచించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రణధీర్, వైద్యాధికారులు ప్రేమ్‌సింగ్, దీపిక, దీప్తి, నవ్యరాణి, శ్రవణ్, నందకిషోర్, జితేందర్, నవ్యశ్రీ, ఏఎంవో దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కోడి కూయక ముందే..
మద్యం జోరు!



రహదారులపైనే తాగుతూ.. ఊగుతూ...!

వరంగల్‌క్రైం, ములుగు, న్యూస్‌టుడే

ఒకప్పుడు పండగకో.. పబ్బానికో మద్యం తాగేవారికి.. ఇప్పుడు సమయం.. సందర్భం అవసరం లేదనిపిస్తోంది. ఎప్పుడు పడితే.. అప్పుడే.. ఎక్కడపడితే అక్కడే.. అది అందుబాటులో ఉండడంతో.. చాలామంది దానికి బానిసలవుతున్నారు. మద్యం దుకాణాలకు తోడు గల్లీకో బెల్టుషాపు దర్శనమిస్తోంది. వరంగల్ నగరంతో పాటు ఉమ్మడి జిల్లాకేంద్రాల్లో కోడి కూయక ముందే ప్రారంభమై రాత్రి ఒంటిగంట వరకు బార్లు డోర్లు తెరుచుకుని ఉంటున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నా.. ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం 'న్యూస్‌టుడే బృందం' నిర్వహించిన పరిశీలనలో సమయపాలన పాటించని మద్యం దుకాణాలు, పలువురు రహదారుల పక్కనే కూర్చొని మద్యం తాగుతూ కనిపించారు.

మీకు తెలుసా..

'జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 2019–22 ప్రకారం.. దేశంలో అత్యధికంగా తాగుడు అలవాటున్న రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానంలో ఉంది.. రాష్ట్రంలో 43 శాతం మందికి మద్యం తాగే అలవాటున్నట్లు వెల్లడైంది. మరోవైపు మద్యానికి బానిసై.. డీఅడిక్షన్ కేంద్రాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.'

ఇవీ నిబంధనలు..

- మద్యం దుకాణాలు (వైన్స్) ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకే తెరిచి ఉండాలి. బార్లకు 11 వరకు అనుమతి ఉంటుంది.
- ప్రతి దుకాణానికి ప్రభుత్వం మద్యం తాగడానికి గది అనుమతి ఇస్తుంది. అది లేనప్పుడు దుకాణం నుంచి కొనుగోలు చేసి తీసుకొని వెళ్లాలి.
- వైన్స్ ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తుండాలి.
- 21 ఏళ్ల లోపువారికి మద్యం అమ్మొద్దు.
- మద్యం సీసాలపై ఉన్న ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మొద్దు.
- జాతీయ రహదారులకు 225 మీటర్ల లోపు మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దు. గుడి, బడికి 100 మీటర్ల లోపు ఉండొద్దు.
- మద్యం కల్తీ జరగకుండా పర్యవేక్షణ తప్పనిసరి.

ఇదీ పరిస్థితి..

- సాయంత్రం దుకాణాలు జాతరను తలపిస్తున్నాయి. రహదారికి ఆనుకుని ఉన్నచోట వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.
- రాత్రి 10 తర్వాతా మద్యం విక్రయిస్తున్నారు. గొలుసు దుకాణాన్ని తెరిచి ఎక్కువ ధరకు అమ్ముతున్నారు.
- వయసుతో సంబంధం లేకుండా పిల్లలకు సైతం అమ్ముతున్నారు.
- ప్రత్యేక సాకులు చూపి రహదారులపైనే నిర్వహిస్తున్నారు.
- మద్యం దుకాణాల వద్ద ఆహార పదార్థాలు, తినుబండారాలు అమ్మకూడదు. అధికారులు ఇవేవీ పట్టించుకోరు.
- అనేక చోట్ల రోడ్డు వెంట ఉన్న మద్యం దుకాణాలతో సాయంత్రం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.
- ఇష్టారీతిన అమ్మకాలు చేస్తున్నారు. క్వార్టర్, ఆఫ్, ఫుల్ బాటిల్‌కు రూ. 30, 50, 100 చొప్పున అధిక ధరలకు గొలుసు దుకాణాలకు విక్రయిస్తున్నారు.



ములుగులో జాతీయ రహదారిపై ఉన్న లక్ష్మీనర్సింహా మద్యం దుకాణం ఇది. ఈ దుకాణానికి ఎలాంటి పార్కింగ్ సౌకర్యం లేదు. జాతీయ రహదారిపైనే వాహనాలను నిలుపుతున్నారు. దుకాణానికి పక్కనే పర్మిట్ రూం ఏర్పాటు చేసుకున్నారు. మద్యం తాగిన తర్వాత ప్లాస్టిక్ గ్లాసులు, సీసాలను పక్కనే పడేస్తుండటంతో.. అపరిశుభ్రంగా ఉంది.



ములుగు మండలం మల్లంపల్లిలో మద్యం దుకాణం ముందు కూర్చొని మద్యం తాగుతూ..



ములుగు పట్టణంలోని వెంకటేశ్వర్ వైన్స్ ఇది. ములుగు మదనపల్లి మార్గంలో ఉంది. దాని పక్కనే ఎస్‌బీఐ బ్రాంచి, ఎదురుగా పంచాయతీ కార్యాలయం, దానికి ఆనుకొని ఉన్న పక్క రోడ్డులో ఎల్ఐసీ, ఏపీజీవీబీ కార్యాలయాలు ఉన్నాయి. మద్యం కోసం వచ్చే వారు వాహనాలను రోడ్డుపై నిలపడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

నేడు ధ్రువపత్రాల పరిశీలన

ములుగు, న్యూస్‌టుడే: ములుగు జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో సీఆర్‌టీ ఖాళీల భర్తీ ప్రక్రియలో భాగంగా ఈనెల 25న ధ్రువపత్రాల పరిశీలన చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి. పాణిని ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీలను ఒప్పంద పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. గతేడాది జులై 2023లో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పరీక్షలో మెరిట్ ఆధారంగా 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు పిలుస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన సీఆర్‌టీలు(తెలుగు, హిందీ, గణితం), పీజీ సీఆర్‌టీలు(ఆంగ్లం, వృక్షశాస్త్రం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణితం, జువాలజీ, నర్సింగ్)పోస్టులకు ఉదయం 10 గంటలకు ములుగులోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంబంధిత అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. అభ్యర్థుల వివరాలను డీఈవో కార్యాలయంలోని నోటీసు బోర్డుపై పెట్టినట్లు పేర్కొన్నారు.

పడిపోతున్న మక్కల ధర!



ఎనుమాముల మార్కెట్‌లో మక్కల ధర క్రమక్రమంగా తగ్గిపోతోంది. ఈ నెల 12న మక్కలకు క్వింటా 3,070 ధర రావడంతో ఈసారి పండించిన పంటకు గిట్టుబాటు ధర వస్తుందని ఆశించిన అన్నదాతకు నిరాశే మిగులుతోంది. మంగళవారం క్వింటాకు రూ. 2,590 పలకడంతో.. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న పంటలో తేమ సాకుతో రోజుల వ్యవధిలోనే క్వింటాపై రూ. వందల్లో కోత విధించడంపై మార్కెట్ అధికారులు దృష్టి సారించాలని, గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు మార్కెట్‌కు ఇప్పుడిప్పుడే వస్తున్న కొత్త పత్తి ధరలు తగ్గుతుండటంతో.. రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వారం క్వింటా కొత్త పత్తికి రూ. 7,510 పలకగా.. మంగళవారం క్వింటా 7,225 ధర పలికింది. – న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సురేష్

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మంగళవారం జిల్లా వ్యవసాధికారి సురేష్ పర్యటించారు. మండల వ్యవసాయాధికారి శ్రీధర్‌తో కలిసి కాటాపురం గ్రామంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. నిల్వల రిజిష్టర్లను పరిశీలించారు. తాడ్వాయి సహకార సంఘం ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి ఇప్పటి వరకు జరిగిన క్రయవిక్రయాల దస్త్రాలను తనిఖీ చేశారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని సూచించారు. కాల్వపల్లి గ్రామాన్ని సందర్శించి దుర్గారం శివారులో సాగులో ఉన్న వరిపంటను పరిశీలించారు. చీడపీడలు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

వాజేడు, న్యూస్‌టుడే: వాజేడు మండల కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటిఐ)లో స్పాట్ అడ్మిషన్ల కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రధానాచార్యులు శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐలో చేరాలనుకునే విద్యార్థులు ఈనెల 28 వరకు ఉదయం 11 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొదటి నాలుగు విడతల్లో సీట్లు రాని వారు వెబ్‌సైట్‌లో ఆప్షన్స్ నమోదు చేసుకోవాలన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రో మెకానిక్, సివిల్, కోపా ట్రేడ్లలో ఖాళీలున్నాయని, పూర్తి వివరాలకు కళాశాలను సంప్రదించాలని కోరారు.

కో-ఆర్డినేటర్ పోస్టుకు..

ములుగు ములుగు జిల్లా విద్యాశాఖలో ఖాళీగా ఉన్న క్వాలిటీ కో-ఆర్డినేటర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి. పాణిని ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ప్రధానోపాధ్యాయులు, స్కూలు అసిస్టెంట్లు గతంలో జరిగిన కో-ఆర్డినేటర్ నియామక పరీక్షకు హాజరై అర్హత సాధించి ఉండాలన్నారు. గతంలో పరీక్షకు హాజరు కాని వారిలో ప్రధానోపాధ్యాయులు మాత్రమే అర్హులని, ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

'బదిలీలు, పదోన్నతుల్లో ఉపాధ్యాయులకు అన్యాయం'



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సమ్మారావు

వెంకటాపురం, న్యూస్‌టుడే: బదిలీలు, పదోన్నతుల్లో అధికారుల వైఖరిని నిరసిస్తూ గిరిజన సంక్షేమశాఖకు చెందిన ఉపాధ్యాయులు ఈ నెల 28న ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ఐకాస నాయకులు ప్రకటించారు. వెంకటాపురం మండలంలోని చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగిన సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గొప్ప సమ్మారావు, టీడబ్ల్యూటీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పి. కృష్ణప్రసాద్‌లు మాట్లాడారు. ఉపాధ్యాయులను సమాయత్తం చేసేందుకు వెంకటాపురం, వాజేడు మండలాల్లోని గిరిజన సంక్షేమశాఖ విద్యాలయాలను సందర్శించామన్నారు. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత ప్రభుత్వం బదిలీలు, పదోన్నతులు చేపడితే ఆ ప్రక్రియను అత్యధిక శాతం ఉపాధ్యాయులు ఉపయోగించుకోలేని పరిస్థితిని అధికారులు తీసుకొచ్చారన్నారు. ఖాళీలను చూపించినా ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న బడుల్లోని పోస్టులను బ్లాక్ చేసి అర్హులైన ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు అన్యాయం చేశారన్నారు. ఈ ప్రక్రియపై అభ్యంతరం వ్యక్తం చేసినా ఐటీడీఏ డీడీ ఇష్టానుసారంగా వ్యవహరించి అధికారులను తప్పుదారి పట్టించినట్లు ఆరోపించారు. 41 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాల్సి ఉండగా, కేవలం పది మందికి పదోన్నతి ఇచ్చి చేతులెత్తేశారన్నారు. కనీస నిబంధనలు, ఉత్తర్వులను పాటించకుండా ఏకపక్షంగా వ్యవహరించి గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయులకు అన్యాయం చేసిన డీడీని తొలగించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలపై వ్యతిరేక భావాలు కలిగేలా ఐటీడీఏ పీవోకు సైతం తప్పుడు సంకేతాలు ఇచ్చారని, తాము ఉపాధ్యాయ సంఘాల బాధ్యులుగా ఉపాధ్యాయుల హక్కులపై పోరాటం చేస్తామని, ఎలాంటి నిబంధనలను ఉల్లంఘించలేదని స్పష్టం చేశారు. తమ డిమాండ్లను సాకుకూలంగా స్పందించాలని కోరారు. ధర్నాకు పెద్దఎత్తున ఉపాధ్యాయులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఏటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు ఎం సంతోశ్, టీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి ఏ రాజు, ఉపాధ్యక్షుడు పి. శ్రవణ్‌కుమార్, ఏటీపీ జిల్లా అధ్యక్షుడు రమేశ్, టీడబ్ల్యూటీయూ జిల్లా అధ్యక్షుడు బి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి వారధి.. రవాణాకు అష్టకష్టాలు

వెంకటాపురం, న్యూస్‌టుడే: అధికారుల ముందుచూపు లేమి, గుత్తేదారు నిర్లక్ష్యం వెరసి గ్రామీణుల పాలిట శాపంగా మారి ప్రయాణానికి ప్రయాస పడాల్సి వస్తోంది. వెంకటాపురం మండలంలోని మల్లాపురం మార్గంలో కంకలవాగుపై వారధి నిర్మాణం అసంపూర్తిగానే వెక్కిరిస్తోంది. ప్రభుత్వం రూ. 4.11 కోట్ల నిధులను కేటాయించినా నిర్మాణం పూర్తికాకపోవడం, ఈ వాగుపై ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన రహదారి ధ్వంసం కావడంతో రవాణా కష్టాలు నిత్యకృత్యంగా మారాయి. స్థానికులతో పాటు వ్యవసాయ పనులకు వెళ్లే కర్షకులు అష్టకష్టాలతో సుదూర ప్రయాణం చేయాల్సిన దైన్యస్థితి నెలకొంది. ప్రత్యామ్నాయ మార్గాన్ని పునరుద్ధరిస్తేనే గోస తీరనుంది.


పిల్లర్లకే పరిమితం



కంకలవాగుపై అసంపూర్తిగా వారధి నిర్మాణం

వెంకటాపురం-మల్లాపురం మార్గంలో చేపట్టిన వారధి నిర్మాణం పిల్లర్లకే పరిమితమైంది. ఏడాది కిందటనే ప్రభుత్వం నిధులను కేటాయించినా సకాలంలో పనులు ప్రారంభం కాకపోవడంతో ఈ ఏడాది వర్షాకాలం కష్టాలు యథాతథంగానే మారాయి. ఐదు పిల్లర్లు 75 మీటర్ల పొడవుతో చేపట్టిన ఈ పనులు ప్రస్తుతం మధ్యలోనే ఆగిపోయాయి. నిర్మాణ గడువు సైతం ముగిసినట్లు తెలుస్తోంది. మళ్లీ ప్రభుత్వం నుంచి గడువును పొడగిస్తేనే పనులు ముందుకు సాగే అవకాశం ఉంది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు ప్రత్యామ్నాయంగా నిర్మించిన అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయి గండి పడింది. దీంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.

ధ్వంసమైన ప్రత్యామ్నాయ మార్గం



వెంకటాపురం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ సబ్ డివిజన్ పరిధికి చెందిన ఈ వంతెన, దారి దుస్థితిని పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. గత నెలలో జరిగిన బదిలీల్లో ఇక్కడి ఏఈఈ ఖమ్మం బదిలీపై వెళ్లారు. ఆ స్థాయికి చెందిన మూడు పోస్టులు, ఇతర ఉద్యోగుల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. అదే సమయంలో డీఈఈ పోస్టు నియామకం పట్టింపు కరవైంది. ఈ మార్గం ద్వారానే మల్లాపురం, కర్రివాని గుంపు గ్రామాల గిరిజనులు రాకపోకలు సాగిస్తుంటారు. వెంకటాపురం, చొక్కాల, వీఆర్‌కేపురం, శివాపురం ప్రాంతాలకు చెందిన రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్తుంటారు. ఇక్కడి ప్రత్యామ్నాయ దారి ధ్వంసం కావడంతో దాదాపు 6 కిలోమీటర్ల సుదూర ప్రయాణం చేయాల్సి వస్తోంది.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



– మడకం పాపారావు, మల్లాపురం

వంతెన పూర్తికాకపోవడం, ప్రత్యామ్నాయ దారి పాడవ్వడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అత్యవసరమైతే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని సుదూరం నుంచి రవాణా సాగిస్తున్నాం. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలు సాగేలా చర్యలు తీసుకోవాలి.

తక్షణం పూర్తి చేయాలి..



– నీలారపు శ్రీను, వెంకటాపురం

కంకలవాగు ఆవలి ప్రాంతంలో ఉన్న వ్యవసాయ క్షేత్రాల వద్దకు వెళ్లిరావడం కష్టంగా ఉంది. అప్రోచ్ రోడ్డు తెగిపోవడంతో వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దుక్కులు దున్నడానికి సైతం చుట్టూ తిరిగి వెళ్తున్నాం. ఇక్కడి పనులను తక్షణం పూర్తి చేస్తేనే రాకపోకలకు ప్రయోజనం.

ఉపాధ్యాయ సర్దుబాటు ఉత్తర్వులు ఉపసంహరించాలి

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: అశాస్త్రీయమైన ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పొడెం సమ్మయ్య డిమాండ్ చేశారు. విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని చెబుతూనే ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం జిల్లా అధికారులకు ఆదేశాలివ్వడం సరైంది కాదన్నారు. ఈ ఆదేశాలతో విద్యార్థులు కూడా వెళ్లిపోయేలా చేసి బడులు మూసివేతకు దోహదం చేసేలా ఉన్నాయని, సంబంధిత ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో పది మంది విద్యార్థులకొకరు, 11 నుంచి 60 మంది విద్యార్థులకైతే ఇద్దరు ఉపాధ్యాయులుంటే నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ప్రశ్నించారు. దీంతో ప్రజలు ప్రభుత్వ పాఠశాలలపైన విశ్వాసం కోల్పోయే ప్రమాదముందని, వెంటనే పునరాలోచించాలని కోరారు.



కల్తీ ముప్పు.. కనిపెడితేనే మేలు..!

'తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లడ్డూ తయారీలో జరిగిన తప్పిదాలపై పెద్ద ఎత్తున విమర్శలొస్తున్న నేపథ్యంలో కల్తీపై అంతటా చర్చ జరుగుతోంది. ఆ బ్రహ్మాండ నాయకుడి ప్రసాదంలోనే కాదు మన నిత్య జీవితంలో ఆహారపదార్థాల్లోనూ కల్తీ జరుగుతోంది. దీన్ని గుర్తించి జాగ్రత్త పడాల్సిన బాధ్యత మనదే'



ప్రస్తుతం కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లుగా రోజులు మారాయి. విపణిలో కల్తీ ఆహార పదార్థాలు రాజ్యమేలుతున్నాయి. మనం చూసే ప్రతీది అందంగా ఆకర్షించేలా కనిపిస్తున్నా లోపల మాత్రం ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలు జోడించి తయారు చేసిన ఉత్పత్తులుంటున్నాయి. నిత్యం ఆరోగ్య రక్షణకు వినియోగించే సర్వరోగ నివారిణి తేనె, తాగే పాలు మొదలు వంటకాల్లో వాడే నూనె, కారం, పసుపు నుంచి మసాలా వరకు కల్తీ బారిన పడినవే. వాటిని తింటూ వ్యాధులను కొనితెచ్చుకుంటున్నాం. ఈ నేపథ్యంలో పదార్థాల నాణ్యత తనిఖీ చేయడం అవసరం. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వెల్లడించిన పద్ధతి ప్రకారం ఇంట్లోనే కల్తీని గుర్తించే విధానంపై కథనం.

ఈనాడు, మహబూబాబాద్

పాలు



● **కల్తీ చేసే పదార్థాలు:** స్టార్చ్ (పిండి పదార్థాలు), డిటర్జెంట్ పౌడర్

● **గుర్తించే విధానం:** 5-10 ఎం.ఎల్., పాలు తీసుకుని వాటికి సమానమైన నీటితో బాగా కలపాలి. డిటర్జెంట్ కలిసి ఉంటే చిక్కని నురగ వస్తుంది. స్వచ్ఛమైన పాలు అయితే సన్నని నురగ పొర ఏర్పడుతుంది.

పాలను వేడి చేసి అందులో కొన్ని చుక్కల అయోడిన్ వేస్తే అవి నీలం రంగుగా మారితే స్టార్చ్ (పిండిపదార్థాలు)లతో కల్తీ చేసినట్లే.

తేనె



● చక్కెర ద్రావణం

● స్వచ్ఛమైన తేనెకు మండే స్వభావం ఉంటుంది. నాణ్యమైన తేనెలో పత్తిని ముంచి మండిస్తే మండుతుంది. ● ట్రాన్సపరెంట్ గ్లాసు పాత్రలో నీళ్లు తీసుకోవాలి. అందులో కొద్దిగా తేనె వేస్తే అది విడిపోతే అందులో చక్కెర ఉన్నట్లు గుర్తించాలి. ● గిన్నెలో నీటిని తీసుకుని అందులో కొద్దిగా తేనెను వేసి వేడి చేయాలి. అప్పుడు చిన్న చిన్న శబ్దాలు వినిపిస్తే చక్కెర కలిపినట్లు. కల్తీ జరగకుంటే ఎలాంటి శబ్దం రాదు. ● ఒక గ్లాసులో కొన్ని నీళ్లు తీసుకొని అందులో ఒక చెంచా తేనె కలిపి కాస్త వెనిగర్ వేయాలి. నురగ వస్తే అది కల్తీ అయినట్లు.

కారం



● ఇటుక పొడి, సింథటిక్ కలర్

● గాజు గ్లాసులో నీటిని తీసుకుని అందులో మిరపపొడిని వేయాలి. ఇటుక పొడి ఉంటే అది నీటి అడుగుభాగానికి చేరుతుంది. గాజు పాత్రలో నీటిపై కారం పొడిని వేస్తే కృత్రిమ (సింథటిక్) రంగు చారల రూపంలో కిందికి దిగుతుంది.

నల్ల మిరియాలు



● బొప్పాయి గింజలు

● ఒక గ్లాసు నీటిలో కొంత మొత్తంలో నల్ల మిరియాలు వేయాలి. స్వచ్ఛమైనవి అడుగు భాగానికి చేరుకుంటాయి. బొప్పాయి గింజలు నీటిపై తేలుతాయి.

కాకరకాయ, పచ్చిమిర్చి, ఇతర ఆకుకూరలు



● ఆకర్షించేలా కృత్రిమ రంగు పూయడం

● నీటిలో, వెజిటబుల్ ఆయిల్‌లో ముంచిన పత్తి దూదిని తీసుకోవాలి. దాన్ని కూరగాయాలపైన రుద్దాలి. దూది ఆకుపచ్చగా మారితే వాటిని కృత్రిమ రంగుతో కల్తీ చేసినట్లు.

నెయ్యి



● పిండిపదార్థం

● గాజు గ్లాసులో కొద్దిగా నెయ్యిని తీసుకొని అయోడిన్ ద్రావణాన్ని కలపాలి. నీలంరంగులోకి మారితే పిండి పదార్థాలతో కల్తీ చేసినట్లు.

ఒక చెంచా నెయ్యిని ఒక గ్లాసు నీటిలో కలిపితే స్వచ్ఛమైన నెయ్యి ఉపరితలంపై తేలుతుంది. నీటిలో కలిసినా, దిగువకు చేరితే అది నూనెలతో కల్తీ కావొచ్చని అర్థం.

పసుపు



● మెటానిల్ ఎల్లో, సన్‌సెట్ ఎల్లో, బియ్యం పిండి

● పరీక్ష నాళికలో కొద్దిగా పసుపు పొడిని తీసుకొని నీటిని కలపాలి. గాఢమైన పసుపు రంగు ఏర్పడితే కల్తీ జరిగినట్లు. బియ్యం పిండి ఉంటే నీటి అడుగులోకి చేరుతుంది.

కంది, పెసర పప్పు



● కేసరి పప్పు, మెటానిల్ ఎల్లో రంగు, టెట్రాజయిన్

● కేసరి పప్పు పలుకులుగా ఉంటుంది. దీన్ని భూతద్దం సహాయంతో గుర్తించొచ్చు. పరీక్ష నాళికలో కొద్దిగా కంది/పెసర పప్పును తీసుకొని కొద్దిగా నీటిని కలిపి దానికి 5మి.లీ. గాఢ హైడ్రోక్లోరికామ్లం కలిపి 10 నిమిషాల తర్వాత పరిశీలిస్తే గులాబీ రంగులో మారితే కల్తీ జరిగినట్లు.

టీ/కాఫీ పొడి



● ఇనుప పొడి, కృత్రిమ రంగులు, చింతగింజల పొడి

● టీపొడిని కొద్దిగా తెల్లని కాగితంపై పలచగా పోసి దాంట్లో అయస్కాంతాన్ని తిప్పితే ఇనుప పొడి దానికి అతుక్కుంటుంది. ● చల్లని నీటిలో టీపొడిని కలిపితే 30 సెకన్లలోనే నీటి రంగు మారితే అది కల్తీ అయినట్లు.

● కాఫీ పొడిని చల్లని నీటిలో బాగా కలిపాలి. కాఫీ పొడి నీటిపై తేలి చింతగింజల పొడి ఉంటే అడుగు భాగానికి చేరి నీటిని మట్టి రంగులోకి మారుస్తుంది.



అనారోగ్య సమస్యలివే..

కల్తీ ఆహార ఉత్పత్తులు తినడం వల్ల జీర్ణకోశ వ్యాధులు, రక్తహీనత, పక్షవాతం, క్యాన్సర్, కంటి వ్యాధులు సంభవిస్తాయి. గుండె, ఊపిరితిత్తులు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి.



– డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్, ఎండీ ఫిజీషియన్

వేరుశనగ, నువ్వుల నూనె



● సోయాబిన్, ఆర్జిమోజన్ నూనె

● ఒక పరీక్షనాళికలో కొద్దిగా నూనె, 5 మి.లీ గాఢ హైడ్రోక్లోరికామ్లం, కొద్దిగా పంచదార కలిపాలి. పరీక్ష నాళిక దిగువన గులాబీ, ఎరుపు రంగు ఏర్పడితే నూనెలు కల్తీ అయినట్లు.

కొబ్బరి నూనె



● మినరల్ ఆయిల్, పామ్ కెర్నల్

● శుద్ధమైన కొబ్బరి నూనెను ఫ్రిజ్‌లో పెట్టి అరగంట తర్వాత చూస్తే పూర్తిగా గడ్డకడుతుంది. సగం గడ్డకట్టి.. సగం కట్టకుంటే కల్తీ అయినట్లు.

ఇవి కూడా..



● అందరూ ఎంతో ఇష్టంగా తినే మిఠాయిల్లో రంగులను పరిమితికి మించి కలుపుతున్నారు. 100 పీపీఎం కంటే ఎక్కువగా కలిపిన మిఠాయిలను తింటే అనారోగ్యానికి దారి తీస్తాయి.

ఇటీవల వరంగల్ జిల్లాలో ఒక మిఠాయి దుకాణంలో ఆహార భద్రతా అధికారులు వాటిని గుర్తించి జరిమానా విధించారు.

● కొబ్బరి పొడిలోనూ నాణ్యత లేనిది ఉంటుంది. కొబ్బరిపొడిలో 55శాతం నూనె ఉండాలి. లేకుంటే నాణ్యత లేనట్లు.

హనుమకొండలో 45 శాతం నూనె ఉన్న ఒక కంపెనీకి చెందిన కొబ్బరి పొడిని స్వాధీనం చేసుకున్నారు.



వారసంతల్లో ఎక్కువగా..

ఇది మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని వారసంత. ప్రతి మంగళవారం నిర్వహిస్తారు. వందల్లోకి అవసరమైన అన్ని సరుకులు ఇలా పెట్టి విక్రయిస్తారు. ఇక్కడ కల్తీ ఎక్కువగా జరిగే ప్రమాదం ఉంది. పసుపు, పప్పులు, ఉల్లిగడ్డలు, సుగంధ ద్రవ్యాలు ఇలా ప్రతిదీ నాణ్యత లేనివే ఉంటాయి. ఈ విషయం తెలియని చుట్టుపక్కల గ్రామాలు, తండాల్లోంచి ప్రజలు వచ్చి కొనుగోలు చేస్తుంటారు.

ఇలా చేద్దాం

కారం పొడిని రైతుల వద్ద, ఎండు మిర్చి విక్రయాలు చేసే దుకాణాల వద్ద ఏడాదికి సరిపడా కొనుగోలు చేసి మరపించుకుని భద్రపరుచుకుంటే చాలు. కల్తీ కారం నుంచి బయటపడొచ్చు. ఇలా కాకుండా ప్యాకెట్లలోని కారం కొనుగోలు చేయాలనుకుంటే ఆహార పరిరక్షణ ప్రమాణాల ప్రకారం ఉందా లేదా చెక్ చేసుకుని కొనాలి.

● గేదెలు సాకుతూ పాలను పట్టణాల్లోకి తీసుకొచ్చి విక్రయించే వారి వద్ద కొనుగోలు చేయాలి. గ్రామాల్లో ఆవులు, గేదెలను పోషిస్తూ వాటి పాల ద్వారా నెయ్యిని తీసి విక్రయాలు చేస్తారు. వారి వద్ద నాణ్యమైనది లభిస్తుంది. దానికి ధర అధికంగా ఉన్నా కొనుగోలు చేయడం ఉత్తమం.

● పసుపు సాగు చేసే కొందరు రైతులు దాన్ని ఉడికించిన తర్వాత పసుపు పొడిగా మారించి విక్రయాలు చేస్తారు. వారి వద్ద కొంటే కల్తీ బారి నుంచి తప్పించుకోవచ్చు.

● తేనె రోడ్లపక్కన పెట్టి విక్రయాలు చేసే వారి వద్ద కొనుగోలు చెయ్యొద్దు. గ్రామాలు, ఏజెన్సీ గూడేలు, తండాల్లో చెట్లకు ఉన్న తుట్టెల ద్వారా సేకరించిన తేనెను గానీ, తేనెటీగల పెంపకం చేపడుతూ తేనె విక్రయించే వారి వద్ద తీసుకోవాలి. కొన్ని అధీకృత కంపెనీల వారు మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నారు. వాటిని కూడా కొనుగోలు చెయ్యొచ్చు.

'దోచుకోవడం, దాచుకోవడం తప్ప భారాస చేసిందేమీ లేదు'



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో ఎమ్మెల్యేలు కేఆర్.నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ మేయర్ సుధారాణి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గత పదేళ్లలో భారాస ప్రభుత్వం రూ.లక్షల కోట్ల అప్పులు చేసిందని, తీవ్ర ఆర్థిక లోటు ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మంగళవారం వరంగల్ మహా నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. భారాస ప్రభుత్వం దోచుకోవడం, దాచుకోవడం తప్ప రాష్ట్రానికి చేసిందేమీలేదని, విచ్చలవిడిగా అప్పులు చేసి రాష్ట్ర ఖజానాను దివాలా తీయించారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల పథకాల్లో అయిదు అమల్లోకి తెచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనన్నారు. భారాస ప్రభుత్వం వైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కేవలం నాలుగైదు కార్పొరేటు ఆసుపత్రులకు మాత్రమే ఎల్వోసీలు ఇచ్చారన్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు చెల్లిస్తున్నామని, విద్య, వైద్యం, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

కాళేశ్వర క్షేత్ర అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక



ప్రముఖుల ఘాట్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్.. చిత్రంలో పాలనాధికారి రాహుల్ శర్మ

కాళేశ్వరం, న్యూస్‌టుడే : కాళేశ్వర క్షేత్ర మలివిడత అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక సిద్ధమవుతోంది.. మే నెలలో జరిగే సరస్వతీ పుష్కరాలపైనా దృష్టి సారించారు. కాళేశ్వర క్షేత్ర సన్నిధిలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, జిల్లా పాలనాధికారి రాహుల్ శర్మ, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌తో కలిసి పర్యాటక, దేవాదాయ శాఖ అధికారులతో క్షేత్ర అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో నిర్మాణాలు ఎంతమేరకు పూర్తి కావచ్చాయి..? మిగతా నిర్మాణాల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని ఈవో మారుతిని ప్రశ్నించారు. సత్వరమే నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్‌కు సూచించారు. రాబోయే సరస్వతీ పుష్కరాలకు ఏవిధంగా ప్రణాళిక చేస్తే బాగుంటుందని అధికారుల వద్ద సలహాలు తీసుకున్నారు. కాళేశ్వర క్షేత్ర అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. దేవాదాయ, పర్యాటక శాఖ అధికారులను పలు ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. మేడిగడ్డ వద్ద బృందావన్ గార్డెన్ మాదిరి పర్యాటక ప్రాంతం అవసరమని, చిన్న మ్యూజియం ఏర్పాటు చేస్తే సందర్శకులు, చిన్నారి విద్యార్థులకు గొప్ప అనుభూతి కలిగిస్తుందని పర్యాటక శాఖ జీఎం ఉపేందర్‌రెడ్డి సూచించారు. బృహత్తర ప్రణాళిక అమలుకు ముందు ఆలయ నిర్మాణాల తీరుపై శృంగేరి పీఠం వారికి వివరించాలని దేవాదాయశాఖ స్థపతి వల్లీ నాయగం సూచించారు. రూ.115 కోట్లతో కాళేశ్వరం, మంథని, రామగిరిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జీఎం వివరించారు. గోదావరి తీర ప్రాంతం అపరిశుభ్రతకు తావులేకుండా పవిత్రతకు మారుపేరులా ఉండాలని శైలజారామయ్యార్ ఆదేశించారు. ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేయాలని సూచించారు. దేవస్థానం అతిథిగృహాలు అస్తికలు నిమజ్జనం చేసే భక్తులకు ఆలయ సిబ్బంది ఇవ్వడం లేదని కాళేశ్వరాలయం మాజీ ఛైర్మన్ కోటరాజబాపు, మాజీ ధర్మకర్త అశోక్ ఆమె దృష్టికి తీసుకురాగా ఈవోపై మండిపడ్డారు. క్షేత్ర ఆవరణలో భక్తులకు సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. డిజైన్ టాయిలెట్స్ నిర్మాణాలు జరగాలని ఆదేశించారు.

నిజాయతీతో సేవలందిస్తే గుర్తింపు



సీపీని కలిసిన ఎస్సైలు అభ్యర్థులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసు ఉద్యోగంలో చేరిన తర్వాత ప్రజలకు నీతి, నిజాయతీతో సేవలందిస్తే మంచి గుర్తింపు ఉంటుందని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. పోలీసు కమిషనరేట్‌కు కేటాయించిన శిక్షణ పొందిన 19 మంది ఎస్సైలు మంగళవారం కమిషనరేట్‌లో సీపీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణను విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమన్నారు. పోలీసు ఉద్యోగం చేస్తున్నందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలన్నారు. చట్టం పరిధిలో సేవలు అందిస్తూ పోలీసుశాఖ కీర్తి ప్రతిష్ఠలు పెంచాలన్నారు.

యథేచ్ఛగా మొరం తరలింపు



మల్లకపల్లి శివారులో మొరం కోసం వచ్చిన వాహనాలు

ధర్మసాగర్, న్యూస్‌టుడే: ధర్మసాగర్ మండలం మల్లకపల్లి నుంచి రాంపూర్‌కు వెళ్లే దారిలో గుట్టల నుంచి మొరం అక్రమ రవాణా యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా ఏడాదికి పైగా గుట్టలను కొల్లగొడుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా అక్రమార్కులు ప్రకృతి సంపదను దోచుకుంటున్నా అధికారులు ఎవరూ స్పందించడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఊర చెరువు సమీపంలోని క్వారీ నుంచి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా రాంపూర్ మీదుగా హనుమకొండ, వరంగల్ నగర శివార్లలో కొత్తగా వెలుస్తున్న వెంచర్లకు తరలిస్తున్నారు. ఇదే రహదారి మీదుగా వ్యవసాయ పొలాలకు వెళ్లే మల్లకపల్లి రైతులు, పనులకు వెళ్లే కూలీలు నిత్యం తిరిగే వాహనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధిక బరువుతో భారీ వాహనాలు తిరగడం ద్వారా రోడ్లు సైతం దెబ్బతింటున్నాయి. ప్రభుత్వం రాయల్టీ నష్టపోతున్నా, రోడ్లు శిథిలావస్థకు చేరుతున్నా అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

ఎండు గంజాయి పట్టివేత



పట్టుకున్న ఎండు గంజాయితో డీఎస్పీ తిరుపతిరావు, సీఐ బాబురావు, ఎస్సైలు గిరిధర్‌రెడ్డి, కుషకుమార్, సిబ్బంది

గూడూరు, న్యూస్‌టుడే: రెండు కార్లలో తరలిస్తున్న 187 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు డీఎస్పీ తిరుపతిరావు మంగళవారం తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాకు చెందిన రాహుల్ మంజుదార్ (22), రాయపూర్‌కు చెందిన హరీష్ యాదవ్ (24), ఒడిశా రాష్ట్రంలోని మల్కానిగిరికి చెందిన మండల నరేష్ (32)లతో ఎండు గంజాయిని ఒడిశా నుంచి భద్రాచలం, ఇల్లందు, మహబూబాబాద్, గూడూరు మీదుగా హైదరాబాద్ తరలించేందుకు ఒడిశా రాష్ట్రంలోని మల్కానిగిరి జిల్లాకు చెందిన బాపన్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. రాహుల్ మంజుదార్, హరీష్ యాదవ్, మండల నరేష్ ఒడిశా నుంచి రెండు కార్లలో హైదరాబాద్ బయలుదేరారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మండలంలోని మచ్చర్ల గ్రామం స్టేజీ వద్ద 365 జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో వస్తున్న రెండు కార్లను ఆపి సోదా చేయగా సుమారు రూ.46.76 లక్షల విలువైన 187.04 కిలోల ఎండు గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చేసుకొని రాహుల్ మంజుదార్, మండల నరేష్, హరీష్ యాదవ్, బాపన్‌లపై కేసు నమోదు చేసి రెండు కార్లు, మూడు చరవాణులను స్వాధీనం చేసుకున్నారు.

'ఐటీఐ'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ చందర్ తెలిపారు. వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలలో 5వ విడత ప్రవేశాలకు అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 23 నుంచి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెరిట్ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 83741 01790లో సంప్రదించాలన్నారు.

ఎనుమామూలు పనులు

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఏడాది క్రితం రూ.17.07 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు అటకెక్కాయి. గతేడాది ఆగస్టు 16న అప్పటి పాలకవర్గం గడువు ముగిసే రెండు రోజుల ముందు హడావుడిగా శంకుస్థాపనలు చేశారు. ఇప్పటి వరకు కేవలం 25 శాతం మాత్రమే పూర్తయ్యాయి. నిర్మాణ పనుల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు మార్కెట్ కమిటీ పాలకవర్గం లేక.. మార్కెట్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో.. నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. మరోవైపు పనులకు సంబంధించి అప్పటి పాలకవర్గానికి, మార్కెట్ అధికారులకూ కమీషన్లు అందినట్లు ఆరోపణలున్నాయి. అందుకే తమ హయాంలోనే పనులు ప్రారంభించాలని.. వేగిరపడినట్లు తెలుస్తోంది.

– న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్



అపరాల యార్డులో కమీషన్ దుకాణాల నిర్మాణాల పనులను మధ్యలోనే నిలిపేసిన గుత్తేదారు

రూ.కోట్ల ఆదాయం.. అభివృద్ధి శూన్యం

పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల కారణంగా.. ఫీజు రూపంలో మార్కెట్‌కు ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. గతేడాది ఫీజు రూపంలో రూ.43.39 కోట్ల ఆదాయం సమకూరగా.. ఈ ఏడాది రూ.56 కోట్ల ఆదాయాన్ని సాధించాలని మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. మార్కెట్ అభివృద్ధిని మాత్రం గాలికొదిలేశారు. రాత్రి సమయంలో విద్యుత్తు దీపాలు లేక మార్కెట్‌లోని యార్డులు చీకటిగా ఉంటున్నాయి. పత్తి, మిర్చి సీజన్లలో దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రైతు విశ్రాంతి భవనంలో మౌలిక సదుపాయాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ ప్రాథమిక వైద్యశాలకు పూర్తిస్థాయిలో వైద్యపరికరాలు, మందులు సమకూర్చేందుకు తగిన నిధులు కేటాయించకపోవడంతో.. రైతులతో పాటు మార్కెట్‌లోని కూలీలు, హమాలీలు, వ్యాపారులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. మార్కెట్ పాలకవర్గం గడువు ముగిసి ఏడాది పూర్తయినా, మార్కెట్ అనేక సమస్యలతో సతమతమవుతున్నా.. స్థానిక మంత్రి, ఎమ్మెల్యేలు పాలకవర్గం నియామకంపై దృష్టి సారించకపోవడం గమనార్హం. పత్తి, మిర్చి సీజన్లలో రైతులకు మద్దతుగా నిలవాల్సిన పాలకవర్గం ఏడాది నుంచి లేకపోవడంతో పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో వ్యాపారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

అభివృద్ధి పనులు	కేటాయించిన నిధులు (రూ.లక్షల్లో)	ఇప్పటివరకు ఖర్చు (రూ.లక్షల్లో)
ధాన్యం, అపరాల యార్డులో ఉప కార్యాలయం నిర్మాణం	47	22.22
మిర్చి యార్డులోని ప్లాట్‌ఫాంల మధ్య ప్రీపెయింటెడ్ షీట్స్‌తో రూఫింగ్	444	191
పసుపు, పల్లికాయ యార్డులో ప్లాట్‌ఫాంల మధ్య ప్రీపెయింటెడ్ షీట్స్‌తో రూఫింగ్	293	64.77
మార్కెట్ రెండో గేట్ వద్ద కళాతోరణం నిర్మాణం	29	26.22
మార్కెట్ రెండో గేట్ వద్ద ఎడ్లబండ్లు, రైతుల ప్రతిమలు ఏర్పాటు	9.20	8.50
ధాన్యం, అపరాల యార్డులో 24×12 వైశాల్యంతో కొత్తగా 40 దుకాణాల నిర్మాణం	420	73.01
పత్తియార్డు కార్యాలయ మరమ్మతు పనులకు	17	0
పత్తియార్డు చుట్టుపక్కల ఉన్న డివైడర్లకు, బారికేడ్లకు సింథటిక్ పెయింటింగ్ పనులకు	10	0
మార్కెట్ చుట్టూ ప్రహరీ పనులకు	20	0
లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో ప్రాంతీయ, జిల్లాస్థాయి మార్కెటింగ్ అధికారుల భవన సముదాయ నిర్మాణం	418	76.32



వేరుశనగ యార్డులో అసంపూర్తిగా షెడ్డు నిర్మాణం

గుత్తేదారులకు నోటీసులు జారీ చేశాం.

పి.నిర్మల, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి

ఎనుమాముల మార్కెట్ పరిధిలోని గుత్తేదారులు చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల బిల్లులకు సంబంధించిన చెక్కులు ఆర్థికశాఖలో పెండింగ్‌లో ఉన్నాయి. కొంతకాలంగా గుత్తేదారులు నిర్మాణ పనులను నిలిపివేశారు. మార్కెటింగ్ శాఖ ఈఈ ద్వారా గుత్తేదారులకు నోటీసులు జారీ చేశాం.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



మంగపేట మండలం కమలాపురం గ్రామంలో ర్యాలీ

కమలాపురం(మంగపేట), న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక, జ్వాలా చారిటబుల్ ట్రస్ట్, కమలాపురం గ్రామ పంచాయతీ సంయుక్తంగా ప్లాస్టిక్ నిషేధంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమలాపురం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ములుగు జిల్లా అధ్యక్షుడు కొయ్యడ మల్లయ్య మాట్లాడుతూ.. ప్లాస్టిక్ ప్రపంచానికి పెను సవాలుగా మారిందని, అనేక రుగ్మతలకు కారణమవుతుందని, పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ నిర్మూలనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రజాపరిషత్ అధికారి బద్రూ నాయక్, మండల పంచాయతీ అధికారి శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయులు గడ్డి శ్రీనివాస్, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి మునిగాల రాకేశ్, పంచాయతీ కార్యదర్శి జంపాల అరుణ్, ఉపాధ్యాయులు ప్రసాద్, సునీత, లావణ్య, నర్సింహరావు, నాగలక్ష్మీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బిల్టు కార్మికుల సమస్యలపై స్పందించండి

కమలాపురం(మంగపేట), న్యూస్‌టుడే: బిల్టు కార్మికుల సమస్యలపై అన్ని పార్టీల నాయకులు స్పందించాలని కార్మికులు కోరారు. మంగళవారం మంగపేట మండలంలోని కమలాపురం గ్రామంలో స్థానిక విలేకర్లతో బిల్టు కార్మికులు మాట్లాడారు. గతంలో బిల్టు కర్మాగారంతో పనులు చేయించుకొని అన్ని రకాలుగా లబ్ధిపొందిన రాజకీయ పార్టీ నాయకులు ఇప్పుడు కార్మికులకు రావాల్సిన వేతనాలు ఇప్పించడానికి ముందుకు రావడం లేదని, ప్రస్తుతం కార్మికులను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2015 నుంచి పరిశ్రమలో ఉత్పత్తి నిలిచిపోయిందని, ధర్నాలు, రాస్తారోకోలు చేసినా.. ఏ పార్టీ నాయకులు స్పందించడం లేదని, ఇప్పటికైనా సహకరించాలని కోరారు. హైకోర్టులో కేసు వేశామని ప్రభుత్వం తరపున కోర్టులో కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐకాస నాయకులు ఎన్‌సీఎల్టీ కోర్టులో కేసు వేశారని, కేసు నడపకుండా ఎందుకు వాపస్ తీసుకున్నారో నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ కార్మికులను నాయకులు మోసం చేశారని, ఇప్పటికైనా వేతనాలు, రావాల్సిన అలవెన్సులు ఇప్పించాలని, లేదంటే 12 మంది ఐకాస నాయకులపై కేసు పెట్టడానికి వెనకాడమని హెచ్చరించారు.



మొక్కలు నాటి సంరక్షిస్తేనే సమాజానికి మేలు

తాడ్వాయి, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మనం వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు చౌలం శ్రీనివాసరావు పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్టీసీ బస్టాండ్, పాఠశాలల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణ కాలుష్యంతో ఓజోన్ పొరకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కేశవరాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి పుష్పనీల, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు సంధ్యారాణి, సుహాసిని, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జీడివాగుపై వంతెన నిర్మిస్తే రవాణా సుగమం

మంగపేట, న్యూస్‌టుడే: ఏటూరునాగారం-కమలాపురం ప్రధాన రహదారిలో ఉన్న జీడివాగుపై ఉన్న పురాతన లోలెవల్ వంతెనను తీసివేసి నూతన వారధి నిర్మించాలని తెలంగాణ మాలమహానాడు ములుగు జిల్లా అధ్యక్షుడు రాజమల్ల సుకుమార్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. మంగళవారం మండల కేంద్రంలో స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. మంగపేట మండలం కమలాపురం గ్రామ సమీపంలోని ఏటూరునాగారం-బూర్గంపాడ్ ప్రధాన రహదారిపై దశాబ్దాల క్రితం లోలెవల్ బ్రిడ్జి నిర్మించారని తెలిపారు. వర్షాకాలం వస్తే వరద నీరు వంతెనపై ప్రవహిస్తుండటంతో.. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. జిల్లా యంత్రాంగం స్పందించి నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు.

ఉపాధ్యాయులకు సన్మానం



గోవిందరావుపేట, న్యూస్‌టుడే: గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో కొన్నేళ్లుగా బోధన చేసిన 19 మంది ఉపాధ్యాయులు ఒకేసారి బదిలీపై వెళ్తుండగా, వారందరికీ గ్రామస్థుల తరపున మాజీ విద్యా కమిటీ ఛైర్మన్ రేండ్ల సంతోష్ సన్మానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నూతన ప్రధానాచార్యులు రాంచందర్‌రావు మాట్లాడుతూ.. ఉద్యోగ జీవితంలో బదిలీ సర్వసాధారణమన్నారు. ఏ వృత్తి ఇవ్వలేని సంతృప్తిని ఉపాధ్యాయ వృత్తి ఇస్తుందని, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఒకరికి ఒకరు చిరకాలం గుర్తుండిపోతారని చెప్పారు. కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న ప్రధానాచార్యులు సలీంపాషా, ప్రధానోపాధ్యాయుడు నిజాముద్దీన్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంఘటితంగా ఉద్యమిస్తేనే హక్కుల సాధన


వెంకటాపురంలో సమావేశమైన మాదిగ ఐకాస జిల్లా నాయకులు

వెంకటాపురం, న్యూస్‌టుడే: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ సాధన లక్ష్యంగా చేపట్టిన మాదిగల మేలుకొలుపు యాత్రను విజయవంతం చేయాలని మాదిగ ఐకాస జిల్లా ఉపాధ్యక్షుడు యాసం రమేశ్ కోరారు. వెంకటాపురం మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29వ తేదీన ములుగు కేంద్రంగా మేలుకొలుపు యాత్రను నిర్వహించతలపెట్టినట్లు పేర్కొన్నారు. ఐకాస వ్యవస్థాపకులు పిడమర్తి రవి, రాష్ట్ర నాయకత్వం ఈ మేలుకొలుపు యాత్రకు తరలిరానున్నట్లు వివరించారు. జిల్లాలోని మాదిగలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని, మండలాలతో పాటు పల్లెల్లోనూ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. అందరం సంఘటితంగా ఉద్యమిస్తేనే హక్కులను సాధించుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐకాస మండల అధ్యక్షుడు తోకల అంజి, జిల్లా కార్యదర్శి యాసం శ్రీను, మండల కార్యదర్శి చెన్నం గౌతం, నరసింహారావు, తేజ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

ములుగు, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమశాఖలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 28న ఏటూరునాగారం పట్టణంలోని ఐటీడీఏ ముందు నిర్వహించతలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరిక శ్రవణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో 30:70 నిష్పత్తిలో పదోన్నతులు కల్పించాలన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో బ్లాక్ చేసిన పోస్టులతో జరిగిన నష్టాన్ని పూడ్చే విధంగా సీనియర్ ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని డిమాండు చేశారు. అనేక సమస్యలను లిఖిత పూర్వకంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోవడంతో ధర్నాకు నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

27న హైదరాబాద్‌లో..



సమావేశంలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ములుగు, న్యూస్‌టుడే: ములుగులోని కళాశాలల్లో చదివే ఎస్సీ విద్యార్థులకు హాస్టల్ మంజూరు చేయాలని ఈనెల 27న హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు వి.రంజిత్ తెలిపారు. మంగళవారం ములుగులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా ఏళ్లుగా ములుగులో హాస్టల్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ములుగులో నివాసం ఉంటూ చదువుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ.. మధ్యలోనే చదువు మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. నాయకులు సురేష్, శివ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో ఉన్నతాధికారుల ప్రత్యేక పూజలు

కాళేశ్వరం, న్యూస్‌టుడే : కాళేశ్వర క్షేత్రంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, పాలనాధికారి రాహుల్‌శర్మ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు కాళేశ్వర క్షేత్ర అభివృద్ధికి క్షేత్రస్థాయిలో నిర్వహించిన సమావేశంలో పాల్గొనేందుకు మంగళవారం రాగా ఆలయ తూర్పు రాజగోపురం వద్ద ఈవో మారుతి ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ద్విలింగాలకు జలాభిషేకాలు నిర్వహించారు. పార్వతీ ఆలయంలో అర్చకులు వారికి ఆశీర్వచనం చేశారు. అర్చకుల సమస్యలను ముఖ్య కార్యదర్శి అడిగి తెలుసుకున్నారు. ఆలయానికి అర్చకుల సంఖ్య తక్కువగా ఉందని, గతంలో నోటిఫికేషన్ వెలువడినా నియామకం జరగలేదని ముఖ్య అర్చకులు ఫణీంద్రశర్మ ఆమెకు వివరించారు. కాళేశ్వర క్షేత్రంలో వృథాగా పడి ఉన్న పూర్వం నాటి శిలాసంపదతో పాటు పూర్వం నాటి సరస్వతీ విగ్రహం ఒక వేదికపై ఏర్పాటు చేయాలని ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ ఈవో మారుతికి సూచించారు. భిన్నమైన శిల్ప సంపద భావితరాలు తిలకించేలా ఒకే వేదిక మీద ఏర్పాటు చేసి వాటి పేర్లు, ప్రాముఖ్యత లిఖించాలని ఆమె సూచించారు.

పరిశుభ్రతతోనే వ్యాధుల నియంత్రణ


చినగంగారం శిబిరంలో వైద్యాధికారి ఆశీశ్, సిబ్బంది

వెంకటాపురం, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను విధిగా పాటిస్తే వ్యాధులను నియంత్రించవచ్చని వైద్యులు పేర్కొన్నారు. జిల్లాలో పలు చోట్ల మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. వెంకటాపురం మండలంలోని ఎదిర ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధికి చెందిన మరికాల, చినగంగారం, చొక్కాల, పాత్రాపురం, శివాపురం, తిప్పాపురం గ్రామాల్లో వైద్యబృందాలు ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. ఆయా శిబిరాలకు వచ్చిన వారికి సేవలందించారు. జ్వరం, దగ్గు, జలుబు, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్న వారికి రక్తనమూనాలు సేకరించారు. సాధారణ జ్వరాలుగా నిర్ధారించి మందులు అందజేశారు. శిబిరాల్లో వైద్యులు ఆశీశ్, స్నేహ, వినయ్, ఎంఎల్‌హెచ్‌పీ మనోహర్, పీహెచ్‌ఎన్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

వాజేడు: మండలంలోని పదిహేడు పంచాయతీల సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా కలెక్టరు, డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో 35 మంది మల్టీపర్పస్ వర్కర్లకు (ఎంపీడబ్ల్యూ) పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. తహసీల్దారు వీరభద్రప్రసాద్, ఎంపీడీవో విజయ, వాజేడు వైద్యాధికారులు మహేందర్, జ్ఞానస, వైద్య పర్యవేక్షకులు వెంకటరమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వాజేడులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు జ్ఞానస


సేవలందిస్తున్న వైద్యాధికారిణి స్నేహ

ఆరోగ్య మహిళ సేవలతో భరోసా

వెంకటాపురం: మహిళల్లో వ్యాపిస్తున్న రుగ్మతలను ఆదిలోనే నియంత్రించేందుకు ఆరోగ్య మహిళ క్లినిక్‌ను నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారిణి స్నేహ అన్నారు. వెంకటాపురం మండల కేంద్రంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో మంగళవారం ఆరోగ్య మహిళ క్లినిక్‌ను నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన మహిళలు ఈ క్లినిక్‌కు తరలిరావడంతో వైద్య సేవలందించారు. అనారోగ్య సమస్యలతో ఉన్నవారి నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షించారు. సాధారణ వ్యాధులుగా నిర్ధారించి మందులు అందజేశారు. ప్రతీ మంగళవారం ఈ క్లినిక్ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎన్ఎం పార్వతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



మంగపేట, న్యూస్‌టుడే: ఈనెల 29న హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో నిర్వహించే అంబేడ్కర్ యువజన సంఘం 48వ వార్షికోత్సవ సభ కరపత్రాలను మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దీగొండ కాంతారావు మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలను ఆచరణలో పెట్టడానికి ఈ సభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు, బహుజన సంఘాలు, వివిధ కుల సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, పల్లికొండ యాదగిరి, నాయకులు సురేష్, నర్సింహరావు, సతీష్, నాగేంద్రబాబు, నరేందర్, ముకుందం, శోభన్, నర్సింహరావు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో వసతి గృహాల్లో అధికారుల నిద్ర

ములుగు, న్యూస్‌టుడే: సంక్షేమ వసతి గృహాలు, ఇతర గురుకులాల్లో వసతుల పరిస్థితి ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం మంగళవారం రాత్రి హాస్టల్ నిద్ర చేపట్టింది. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయాల్లో అధికారులు నిద్ర చేశారు. జిలాలో మొత్తం 80 వసతి గృహాలు, గురుకుల పాఠశాలలున్నాయి. అధికారులు రాత్రి విద్యార్థులతో కలిసి భోజనం చేసి సమస్యలు తెలుసుకుంటారు. రాత్రి నిద్ర చేసి బుధవారం ఉదయం విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరిస్తారు. మండల ప్రత్యేక అధికారులు(జిల్లాస్థాయి అధికారులు) ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు, ఎంఈవోలు పల్లె నిద్రలో పాల్గొన్నారు.

వెంకటాపురం వసతి గృహంలో..


ఆహార నాణ్యతను పరిశీలిస్తున్న తహసీల్దారు లక్ష్మీరాజయ్య

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని తహసీల్దారు పి.లక్ష్మీరాజయ్య మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. పల్లె నిద్రలో భాగంగా హాస్టల్‌ను సందర్శించిన ఆయన విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహారంలో నాణ్యతను పరిశీలించారు. ఆహార పట్టిక మేరకు విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రాత్రి వసతి గృహంలోనే నిద్రించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఉప తహసీల్దారు మహేందర్, ఆర్ఐ మల్లయ్య, సంక్షేమ వసతి గృహం బాధ్యులు ఉన్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి


రవికుమార్(పాతచిత్రం)

కన్నాయిగూడెం, న్యూస్‌టుడే: అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందిన ఘటన కన్నాయిగూడెం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాటాపురం గ్రామానికి చెందిన ఎల్.రవికుమార్(27) ఏటూరులోని తన అత్తగారింటికి కూలీ పనుల కోసం వచ్చాడు. రెండు రోజుల(శనివారం) నుంచి కన్పించడం లేదని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని కంతనపల్లి చెరువు సమీపంలో మృతదేహం ఉన్న విషయాన్ని మొదట గొత్తికోయలు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహానికి కాళ్లు, చేతులు లేవు. ఆత్మహత్యకు పాల్పడ్డాడా? ఎవరైనా హత్యచేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డివిజన్‌స్థాయి క్రీడా పోటీలకు సౌకర్యాలు కల్పించాలి


మైదానాన్ని పరిశీలిస్తున్న నారాయణ, శ్యామలత, ఉపాధ్యాయులు

వాజేడు, న్యూస్‌టుడే: ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని వాజేడు, వెంకటాపురం మండలాల ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు నిర్వహించే డివిజన్‌స్థాయి క్రీడల నిర్వహణకు మైదానాన్ని పరిశీలించారు. వాజేడు, వెంకటాపురం మండలాల్లోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు ఈనెల 27న పేరూరు ఆశ్రమ పాఠశాలలో డివిజన్ స్థాయి క్రీడలు జరగనున్నాయి. పేరూరు ఆశ్రమ పాఠశాలలో జరిగే క్రీడాపోటీలకు క్రీడల కన్వీనర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ, స్పోర్ట్స్ అధికారి శ్యామలత, ఉపాధ్యాయ బృందం మంగళవారం మైదానాన్ని పరిశీలించారు. డివిజన్ స్థాయి పోటీలకు మైదానంలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని ఉపాధ్యాయ బృందం సమావేశంలో నిర్ణయించారు. పీడీలు, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, నాగేంద్రకుమార్, సత్యనారాయణ, బద్రి, నర్సింగరావు, నాగేంద్రప్రసాద్, శ్రీను, పార్వతి, యశోద తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే సేవా గుణాన్ని అలవర్చుకోవాలి


కళాశాల ఆవరణలో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రేణుక అన్నారు. జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు శ్రమదానం చేశారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సీహెచ్.వెంకటయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడారు. విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా.డి.నవీన్, డా.పి.జ్యోతి, కనీస్ ఫాతిమా, సంపత్, మున్ని, రమేష్, శేఖర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలను తొలగించొద్దని నిరసన

వెంకటాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని పాలంపేట సమీపంలోని ప్రభుత్వ భూమిలో వెంకటాపూర్ మండల పాత్రికేయులు ఏర్పాటు చేసుకున్న గుడిసెలను మంగళవారం రెవెన్యూ అధికారులు తొలగించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న మండల పాత్రికేయులు అక్కడకు చేరుకుని వారితో మాట్లాడి అనంతరం రోడ్డుపై ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సదానందం సంఘటనా స్థలానికి చేరుకుని మాట్లాడారు. ఇళ్లస్థలాలు ఇవ్వడం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలో కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమింపజేశారు. కార్యక్రమంలో వెంకటాపూర్ మండల రామప్ప జర్నలిస్టు సొసైటీ సంఘం అధ్యక్షుడు బేతి సతీష్, సభ్యులు దేశిని మహేందర్, తీగల యుగేందర్, రంగిశెట్టి రాజేందర్, రాజు, ఆలుగొండ రమేష్, గొరంటాల విజయ్, భిక్షపతి, రామకృష్ణ, వినిల్, సారంగం తదితరులు పాల్గొన్నారు.

జావెలిన్‌త్రోలో జాతీయ స్థాయికి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఈటె విసరడంలో ఏటూరునాగారం గిరిజన బాలుర గురుకుల క్రీడల పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి బొడ్డు ఆకాష్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన దక్షిణ మండల(సౌత్ జోనల్) రాష్ట్ర స్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ జావలిన్ త్రో(ఈటె విసరడం)లో అత్యంత ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. కళాశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాస్‌రెడ్డి, పీడీ ఎం.పృథ్వీరాజ్, అధ్యాపకులు శ్రీరాములు, కుమారస్వామి, గోపాలరావు, జైపాల్, తోటి విద్యార్థులు ఆకాశ్‌ను అభినందించారు.

ఆలయాల భద్రతకు చర్యలు

వెంకటాపూర్, న్యూస్‌టుడే: వెంకటాపూర్ మండలంలోని రామప్ప పరిధి గొల్లాల గుడి ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదైనట్లు పురావస్తుశాఖ సూపరింటెండెంట్ హైదరాబాద్ మండలం స్మితా ఎస్.కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రామప్ప ఉపాలయాలు చుట్టూ సోలార్ లైటింగ్, సీసీ కెమెరాలు, వాచ్‌మెన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆమె తెలిపారు.

అధిక సభ్యత్వాలే లక్ష్యంగా ముందుకు


ములుగు పట్టణంలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న భాజపా శ్రేణులు

ములుగు, న్యూస్‌టుడే: ములుగు పట్టణంలో మంగళవారం భాజపా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ.. సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతుగా నిలవాలని కోరారు. అధిక సభ్యత్వాలే లక్ష్యంగా, ములుగు జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని తెలిపారు. నాయకులు జినుకల కృష్ణాకర్‌రావు, గాదం కుమార్, రాయంచు నాగరాజు, బైకని మహేందర్, సాగర్, దుగ్గినేని బాను, విక్రాంత్, కట్టయ్య, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి పెద్దపీట


సమావేశంలో మాట్లాడుతున్న కల్యాణి

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ మహిళాభివృద్ధికి పెద్ద పీట వేస్తోందని జిల్లా మహిళా అధ్యక్షురాలు రేగ కల్యాణి అన్నారు. ఏటూరునాగారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం మండల మహిళ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణ వసతిని కల్పించిందని, వంట గ్యాసుకు రాయితీగా రూ.500 చెల్లిస్తుందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మహిళా సంఘాలకు రూ.కోట్లాది నిధులు కేటాయించడం జరుగుతోందన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్లను కూడా మంజూరు చేస్తుందని, కాంగ్రెస్ అంటేనే మహిళలకు అండ అని తెలిపారు. ప్రతి మహిళ అఖిల భారత మహిళా కాంగ్రెస్‌లో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. మండలాధ్యక్షుడు రఘు, ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్నఎల్లయ్య, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు కట్కూరి రాధిక, మండల మహిళా కోఆర్డినేటర్ జి.భాగ్య, మాజీ ఉప సర్పంచి కర్ల అరుణ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

27న యోగా టీచర్ పోస్టులకు ముఖాముఖి

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోని ఆయుష్ ఆరోగ్య కేంద్రాల్లో యోగా శిక్షకుల నియామకం చేపడుతున్నట్లు ప్రాంతీయ ఆయుష్ శాఖ ఆర్‌డీడీ ప్రమీలాదేవి, ఆయుష్ జిల్లా ఇన్‌ఛార్జి డా.మైదం రాజు తెలిపారు. యోగా టీచర్ల నియామకానికి ఈ నెల 27న వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో ఉదయం 10 గంటలకు ముఖాముఖి నిర్వహించనున్నామని, వివరాలకు ఆయుష్‌శాఖ ఆర్‌డీడీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

'అర్హతలేని ఉపాధ్యాయులతో విద్యాబోధన'

పస్రా,(గోవిందరావుపేట): మండల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లో కనీస వసతులు కల్పించకపోవడంతో.. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని భారత విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సిరిపల్లి జీవన్ అన్నారు. పస్రాలో ఆయన మాట్లాడుతూ.. ఇరుకు గదుల్లో పాఠాలు చెబుతున్నారని, అర్హత లేని ఉపాధ్యాయులచే విద్యాబోధన జరుగుతుందన్నారు. ఉన్నతాధికారులు బడులను తనిఖీ చేయాలని, లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.